క్లుప్తంగా

25న వాహనాల వేలం

పుంగనూరు: పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 25న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ సురేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు చెల్లించి, స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు గుర్తింపు కార్డు అవసరం



ఏవో రాజేష్

పుంగనూరు: రైతులందరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక గుర్తింపుకార్డు కోసం నమోదు చేసుకోవాలని ఏవో రాజేష్ కోరారు. వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, తదితర సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రత్యేక గుర్తింపు కార్డు ఎంతో అవసరమని తెలియజేశారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులందరూ తమ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు, భూమి వివరాలతో అనుసంధానం చేసుకుని, ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను పొందాలని ఆయన కోరారు.

సీఏ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాత కుషాల్

కుప్పం: కుప్పం ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సీఏ పుస్తకాలను యువ చార్టర్డ్ అకౌంటెంట్ కొమ్మినేని కుషాల్ పంపిణీ చేశారు. రూ.లక్ష విలువ చేసే సీఏ పుస్తకాలను సోమవారం కళాశాలోని విద్యార్థులకు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన కుషాల్ సీఏ పూర్తి చేసి అకౌంటెంట్‌గా విధులు కొనసాగిస్తున్నాడు. ఇంటర్ చదివిన అనంతరం సీఏ చేస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందస్తుగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీఏ కోర్సుపై విద్యార్థులకు సరైన అవగాహన లేదని, దీనిపై అవగాహన పెంచుకుని ఈ కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు జగదీష్‌బాబు, కార్తిక్, త్రివిక్రమ్, కుమార్, ఆర్టీసీ కార్మిక నాయకులు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.


గొల్లపల్లెలో జాతర



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ గొల్లపల్లెలో ఆరిమాను గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి, సోమవారం అమ్మవారి సర్వదర్శనంతో జాతర సాగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు పొంగళ్లు మోసి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరై అమ్మవారికి పూజల్లో పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి డైపర్ల వితరణ



డైపర్లను అందజేస్తున్న దాత మధు

పలమనేరు: పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మధు సోమవారం రూ.4వేల విలువ చేసే డైపర్లను అక్కడి వైద్యులకు అందజేశారు. దాతను ఆస్పత్రి సూపరింటెండెంట్ మమరాతాణి, ఆర్ఎంవో డా.శారద అభినందించారు. దాతలు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన

శాంతిపురం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల సచివాలయం వద్ద సోమవారం వారు ర్యాలీ చేసి ప్రాజెక్టు అధికారికి వినతిపత్రాన్ని అందించారు. అంగన్‌వాడీలకు నెలసరి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు మార్గదర్శకాలు ఇవ్వాలని డిమాండు చేశారు.



ర్యాలీగా వెళుతూ, నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పలమనేరు మండలం ముసలమడుగు వద్ద విరగపూసిన మామిడిపూత



ఆలస్యం.. వికాసం!

పలమనేరు: నియోజకవర్గంలోని పలు మామిడి తోటల్లో ఆలస్యంగా కనిపించిన పూత ప్రస్తుతం విరగపూసింది. అయితే దీన్ని ఎలా కాపాడుకోవాలా అని రైతులు ఆలోచిస్తున్నారు. పలమనేరు ఉద్యానశాఖ డివిజన్‌పరిధిలో 1.10 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రస్తుతం తోపులు పూతదశలో ఉన్నాయి. చిగురు పట్టే దశలో వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉంది. దీంతో పూత ఆలస్యమైంది. ఆపై వాతావరణం అనుకూలించడంతో మామిడి తోటల్లో పూత బాగా పట్టింది. చెట్టు నిండా పూత విరగపూసింది. మామిడి పూతను కాపాడుకోవడానికి పలమనేరు ఉద్యానవనశాఖాధికారి లక్ష్మీప్రసూన కొన్ని సూచనలు చేశారు. మామిడిపూతకు డైనటోపురాన్, బెంజిఫైరిమాక్సిన్‌లను వాడుకోవాలి. బూడిద తెగులుకు హెక్సాకోనజోల్, మైక్లోబుటానియల్, అజాక్సిస్ట్రోబిన్ వినియోగించాలి. కన్ను తెగులు, బూడిత తెగుళ్లకు థయోఫినైట్ మిథైల్, కార్బండిజన్ బాగా పనిచేస్తుంది. పిందె దశలో తామరపురుగు నివారణకు డైనటోపురాన్, ఎమామెక్టిన్, ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్‌లను వాడుకోవాలి. కాయలకు కవర్లను కడితే నాణ్యమైన ఉత్పత్తి వస్తుందని ఆమె తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీ జయారాముడు

రొంపిచెర్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా అధికారి శ్రీ జయా రాముడు సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు పేదలు మాత్రమే వస్తారని తెలిపారు. 24 గంటలూ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయ్, దినేష్ కుమార్ రెడ్డి, సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

అనాథలయ్యారు.. ఆదుకోండి సారు!

శాంతిపురం: కడపల్లి పంచాయతీ మాదనపల్లిలో తండ్రి చేతిలో తల్లి హతమవ్వడం, తండ్రి జైలుకు పోవటంతో ముగ్గురు బిడ్డలు అనాథలుగా మారారు... వారిని ఆదుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరారు. వీరి విజ్ఞప్తితో తహసీల్దార్ శివయ్య సోమవారం బాధిత కుటుంబాన్ని నేరుగా కలిసి పరామర్శించారు. తల్లి మంగమ్మను మద్యం మత్తులో ఉన్న తండ్రి మునస్వామి హత్య చేశాడని పిల్లలు వివరించారు. మృతురాలి కుమారుడు ప్రకాష్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో, కుమార్తెలు కావ్య, రమ్య స్థానిక కస్తూర్బా స్కూల్లో 10, 9 తరగతులు చదువుతున్నట్టు తెలిపారు. దీనిపై కలెక్టరు ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తహసీల్దార్ వారికి భరోసా ఇచ్చారు. ముగ్గురు పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్యను అందించాలని, ఆడబిడ్డల కేర్ టేకింగ్ బాధ్యతలను స్త్రీశిశు సంక్షేమ శాఖ చూడాలని దళిత నాయకులు దేవరాజులు మాదిగ, బాలచంద్రబాబు కోరారు. గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా సాగుతున్న అక్రమ మద్యం అమ్మకాలతో ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని వారు వాపోయారు.



బాలికలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య

పశువులకు గ్రాసం కొరత



వ్యాపారస్తుల నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేస్తున్న రైతులు

వి.కోట: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు గడ్డి కొరత తీవ్రమవుతోంది. వేసవి ఆరంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే ముమ్ముందు ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాలోనని రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అదే సమయంలో పచ్చ, ఎండు గడ్డి ధరలు భారీగా పెంచాశారు. దీంతొ పశు పోషణ అన్నదాతలకు భారంగా మారుతోంది. మండలంలో దాదాపు 40 శాతం మంది రైతులు పాడి పరిశ్రమ మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ పశువుల మేతలు కరువవడంతో తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పశుగ్రాసంకు కొరత ఏర్పడడంతో పొరుగు రాష్ట్రాల నుంచి ఎండు గడ్డిని వ్యాపారులు తీసుకొచ్చి, ఇక్కడి రైతులకు విక్రయిస్తున్నారు. అయితే ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉండడంతో ధరలు అమాంతం పెంచేశారు. ఫలితంగా రైతుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వ్యాపారులు ఎండు గడ్డిని 25నుంచి 30 కిలోల బేళ్ల కట్టను తెచ్చి రూ.250 నుంచి రూ.300కు అమ్ముతుంటారు. ఇలాంటి 150 బేళ్ల కట్టలు ఒక లోడ్‌గా పరిగణిస్తారు. మండలంలో రోజుకు 5 నుంచి 6 లోడ్ల వరకు ఈ ఎండుగడ్డి విక్రయాలు సాగుతున్నాయి. గతంలో కంటే వీటి ధరలు రెట్టింపు చేసి విక్రయిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలుపుతున్నారు.

కార్పొరేషన్ రుణం.. టీడీపీ బేరం!

- దరఖాస్తులో ఐదుగురి నాయకుల సంతకాలు తప్పనిసరి
- రుణం కోసం టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- వేలల్లో వస్తున్న దరఖాస్తులు

కార్పొరేషన్ రుణం మంజూరు చేయాలంటే ఆ దరఖాస్తులో టీడీపీ నాయకులు ఐదుగురు సంతకాలు చేయాలి. లేదంటే ఆ దరఖాస్తు చెల్లుబాటు కాదు. దీంతో రుణం కోసం వెళ్లిన దరఖాస్తుదారులతో అధికార పార్టీ నాయకులు బేరాలాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'రుణం ఎంత కావాలి.. మాకెంత ఇస్తావు' అంటూ ప్రశ్నించడంతో కొందరు నిరాశతో వెనుదిరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే దరఖాస్తులు వేలల్లో వస్తున్నా, రుణాలు మాత్రం వందల్లో కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రుణాల మంజూరుపై కాకి లెక్కలు చెబుతోంది.



మీ-సేవలో దరఖాస్తు చేసుకుంటున్న యువత (ఫైల్)

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ రుణాల పేరిట ప్రజలకు కాకిలెక్కలు చెబుతూ నిలువునా మోసం చేస్తోంది. నియోజకవర్గానికి మంజూరు చేసింది వందల్లో రుణాలైతే.. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉన్నాయి. రుణం కావాలంటే పంచాయితీలో కీలకంగా పనిచేసే టీడీపీ నాయకుల ఐదుగురి సంతకాలు తప్పనిసరి. ఈ తతంగంతో యువతకు కార్పొరేషన్ రుణాలపై ఆశలు ఆవిరవుతున్నాయి.

రుణం కావాలంటే అవి తప్పనిసరి

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ఐదుగురి సంతకాలు దరఖాస్తు ఫారంలో తప్పనిసరిగా ఉంటేనే రుణాలు మంజూరు చేస్తారు. పంచాయతీ స్థాయిలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్రియాశీలక కార్యకర్తలు ఐదు కేడర్లను టీడీపీ నియమించింది. ప్రభుత్వం నుంచి ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారుడికి చేరాలంటే ఈ ఐదుగురి సంతకాలు తప్పనిసరి. దీంతోపాటు దరఖాస్తుదారుడు జననాయకుడి పేరిట టీడీపీ ముద్రించిన పసుపు అర్జీ ఫారంపైన తప్పనిసరిగా నమోదు చేయాలి. బ్యాక్‌గ్రౌండ్ చంద్రబాబు ఫొటో, పసుపురంగు పేజీ, సైకిల్ గుర్తులతో కూడిన దరఖాస్తు ఫారంపై నమోదు చేసి సంబంధిత ఐదుగురి సంతకాలు ఉంటేనే రుణం మంజూరవుతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ దరఖాస్తు ఫారం కూడా ఆన్‌లైన్‌తో పని లేకుండా నేరుగా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన నాయకుడి విభాగంలో 8 మంది ప్రత్యేక సిబ్బంది ద్వారా అందజేస్తున్నారు. వీరి వద్దకు వచ్చి దరఖాస్తు నమోదు చేస్తేనే పరిగణనలోనికి తీసుకుంటారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. పేరుకు మాత్రమే కార్పొరేషన్ రుణాలు గానీ మొత్తం అధికార పార్టీ వ్యవహారంలాగా సాగుతోంది.

వందల్లో మంజూరు.. వేలల్లో దరఖాస్తులు

కార్పొరేషన్ రుణాలు కుప్పం నియోజకవర్గానికి వందల్లో మంజూరయ్యాయి. కానీ నేరుగా జననాయకుడి అర్జీ కేంద్రం ద్వారా వేలల్లో దరఖాస్తులు అందాయి. కుప్పం నియోజకవర్గానికి 535 కాపు కార్పొరేషన్ల రుణాలను ప్రభుత్వం కేటాయించింది. కానీ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయంలో జన నాయకుడి విభాగంలోనే వేలల్లో దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇక ఆన్‌లైన్ ద్వారా భారీగా దరఖాస్తులు నమోదైనట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ద్వారా రుణాలు వస్తాయని పాడి పరిశ్రమలపైన అధిక ఆశ చూపుతున్న యువ రైతులు, యువతకు రుణాలు నిరాశనే మిగుల్చుతున్నాయి.

కెనరా ఏంజల్ సేవింగ్స్ ఖాతాను వినియోగించుకోండి

వి.కోట: మహిళల కోసం కెనరా బ్యాంక్ ప్రవేశపెట్టిన కెనరా ఏంజల్ సేవింగ్స్ ఖాతాను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో సోమవారం బ్యాంక్ సిబ్బందితో కలసి ఆయన డోర్ టూడోర్ క్యాంపెయిన్ చేశారు. మహిళల కోసం నూతనంగా ప్రవేశ పెట్టిన ఏంజల్ సేవింగ్స్ ఖాతాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్ చికిత్స కోసం బ్యాంకు ఖాతాను ఓపెన్ చేస్తే రూ.10 లక్షల వరకూ ఎటువంటి రుసుము లేకుండా క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌ను పొందవచ్చన్నారు. ఈ ఖాతాదారులకు వ్యక్తిగత ప్రమాద బీమా రూ.26 లక్షల వరకు వర్తించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఫీల్డ్ ఆఫీసర్ శశిధర్ ఉన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్, సిబ్బంది

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి పూజలు చేసి హారతి అందుకున్నారు. కార్యక్రమంలో ఉభయదారులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలనూ పట్టించుకోరా?

- పలమనేరు ఎంపీడీవోకు తీర్పు కాపీ అందించిన ప్రజాప్రతినిధులు
- మంజూరైన మండల, జెడ్పీనిధుల పనులు చేపట్టాలని వినతి





హైకోర్టు తీర్పు కాపీ, కాపీని ఎంపీడీవోకు అందిస్తున్న పిటిషనర్ విశ్వనాథ రెడ్డి, ప్రజాప్రతినిధులు

పలమనేరు: ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని ఆ పార్టీ నేతల మాటతో మండలంలో అభివృద్ధికి ఆటంకం నెలకొందని దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించామని కనీసం హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలైనా అమలు చేయాలంటూ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం స్థానిక ఎంపీడీవో ఖాదర్‌బాషాకు విన్నవించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కూటమి నేతల గుప్పెట్లో ఎంపీడీఓ

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని మహాత్మాగాంధీ ఆనాడు చెప్పిన మాట. ఇదే వాస్తవం అని అందరికీ తెలుసు. కానీ క్షేత్రస్థాయిలో గ్రామాలను పట్టించుకునేవారే లేరు. పారిశుధ్యం, తాగునీరు, బోరు మరమ్మతులకు సైతం కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులను ఖర్చు చేయడం లేదు. జెడ్పీ, మండల గ్రాంట్ల నిధులు ఉన్నా కూటమి నేతలు వీటిని ఖర్చుపెట్టనీయకుండా ఎంపీడీవోను గుప్పెట్లో పెట్టుకున్నారు. కట్టడి చేయడంతో మంజూరైన నిధులను సైతం వాడుకోలేని పరిస్థితి పలమనేరు మండలంలో నెలకొంది. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కొందరు సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు ధర్మాసనం ఉన్న నిధులను నెలరోజుల్లో విడుదల చేసి మండల సభ తీర్మానించిన పనులను చేపట్టాలని ఇటీవల ఆదేశించింది.

హైకోర్టును ఆశ్రయించిన వైనం...

దీనిపై మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి పిటిషనర్‌గా పీఆర్ అండ్ ఆర్‌డీ ఉన్నతాధికారులతోపాటు ఎంపీడీవోలపై హైకోర్టులో రిట్‌పిటిషన్(18/2025)ను దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ధీరజ్‌సింగ్ టాకూర్, జస్టిస్ రవి చీమలపాటి ఈ నెల 5న తీర్పును వెలువరించారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ పెండింగ్‌లోని నిధులను నెలరోజుల్లో ఖర్చు చేసి అక్కడి మండల సభ తీర్మానించిన పనులు చేపట్టాలను తీర్పులో ఆదేశించారు. ఈ తీర్పు కాపీని ఎంపీడీవోకు ఇవ్వాలని ఆ ఆదేశాల్లో తెలిపారు. దీంతో పిటిషనర్ విశ్వనాథ రెడ్డి మండలంలోని ప్రజాప్రతినిధులతో కలసి హైకోర్టు ఆదేశాల కాపీతోపాటు వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. అయితే హైకోర్టు ఆదేశాలనైనా పట్టించుకుంటారా అన్న అనుమానం మండలవాసుల్లో వ్యక్తమవుతోంది.

ఏమి జరిగిందంటే..

గ్రామాల అభివృద్ధిలో మండల, జెడ్పీ నిధులు కీలకం. కానీ ఆయా మండలాల్లో ఇప్పటికే మంజూరైన నిధులను సైతం కూటమి నేతలకు తెలియకుండా పనులు చేపట్టరాదని ఎంపీడీవోలను ఆదేశించారు. దీంతో ఈ నిధులు అలాగే మగ్గుతున్నాయి. పలమనేరు మండలానికి సంబంధించి గతంలో జరిగిన మండల మీట్‌లో ఎంపీపీ నాలుగు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఇందులో జగమర్లకు మంచినీటి సరఫరా, కురప్పల్లిలో సీసీ రోడ్డు, బయ్యప్పగారిపల్లిలో పైపులైను ఏర్పాటు పనులున్నాయి. ఇందుకోసం రూ.55 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే కూటమి నేతల ఒత్తిళ్లతో పలమనేరు ఎంపీడీవో ఖాదర్‌బాషా ఈ పనులకు ఆమోదం తెలపలేదు. దీంతో ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.



పలమనేరు మండలం కాలువపల్లి వద్ద కౌండిన్య నదిపై నిర్మించిన డా.వైఎస్సార్ జలాశయంలో మొన్నటివరకు నీరుండేది. పక్షులు వచ్చి దాహం తీర్చుకుంటుండేవి. అయితే ఇటీవల నీరులేక జలాశయం పూర్తిగా ఎండిపోయింది. ఈ క్రమంలో దాహం తీర్చుకోవడానికి తరచు వచ్చే కొంగల గుంపు సోమవారం వచ్చింది. అయితే చుక్క నీరు కూడా లేకపోవడంతో అక్కడి డ్యామ్‌పై కొంగలు ఇలా నిరీక్షిస్తూ కూచున్నాయి. – పలమనేరు